సాక్షి
నంద్యాల
శనివారం । 5 । జూలై । 2025



టీడీపీ నాయకుడి దౌర్జన్యం

తీసుకున్న అప్పులు తిరిగి ఇవ్వమనడంతో టీడీపీ నాయకుడు దౌర్జన్యం చేశాడు. రౌడీ మూకలతో కలిసి దాడి చేశాడు. గుండుపాపల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

8లో ▸



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి శుక్రవారం నాగపూర్‌కు చెందిన సీమమనీష్‌నువాల్ రూ.1,11,000 విరాళాన్ని అందజేశారు.



వైభవంగా జయంత్యుత్సవం

భారీ జనం సందోహం మధ్య దిగువ అహోబిలంలో శుక్రవారం సుదర్శన మూర్తి జయంత్యుత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా సుదర్శన హోమం చేశారు.

8లో ▸

న్యూస్‌రీల్

రూ.28 లక్షల పొదుపు సొమ్ము స్వాహా

- బుక్ కీపర్‌పై విచారణకు ఆదేశించిన కలెక్టర్

వెలుగోడు: పొదుపు మహిళలు నెల నెల దాచుకున్న సొమ్మును ఓ బుక్ కీపర్ స్వాహా చేసిన ఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. రెండు పొదుపు సంఘాల నుంచి దాదాపుగా రూ.28 లక్షలు బుక్‌కీపర్ కాజేసినట్లు కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదులు అందడంతో అధికారులను విచారణకు ఆదేశించారు. విషయం తెలుసుకున్న పట్టణంలోని దాసరి పేట, కుమ్మరి పేటకు చెందిన పొదుపు గ్రూప్ సభ్యులు ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఐదేళ్లుగా బుక్‌కీపర్ పొదుపు సొమ్మును డ్రా చేసుకుని సొంతానికి వాడుకుని తిరిగి చెల్లించలేదని మహిళలు మండిపడ్డారు. బుక్ కీపర్ కుటుంబం వెలుగోడు నుంచి వేరే ఊరికి మారడంతో విషయం వెలుగు చూసిందని మహిళలు పేర్కొన్నారు. తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని పొదుపు సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు.

అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి, ధైర్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్య్రం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడు మన్యం వీరుడు అల్లూరు అన్నారు. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్య్ర ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులకు అండగా నిలిచి. బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడని, ఆయన చూపిన ధైర్యం, తెగువ, స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాము నాయక్, పర్యాటక అధికారి, అల్లూరి సీతారామరాజు పుస్తక రచయిత సురేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు (సెంట్రల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎల్‌వీ శేషాద్రి తెలిపారు. సత్వర న్యాయం అందించాలనే ధ్యేయంతో ప్రతి మూడు నెలలకోసారి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం మార్చి తర్వాత శనివారం రెండోసారి జిల్లా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 16 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేసి అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు న్యాయమూర్తులు వారివారి స్థానాల్లో ఉండి కేసుల పరిష్కారం చేస్తారన్నారు. అన్ని రకాల సివిల్, రాజీ కాగల క్రిమినల్, రోడ్డు ప్రమాద, చెక్ బౌన్స్, బ్యాంకు, మున్సిపల్ కేసులు, అలాగే భార్యాభర్తల వివాదాలు, ఇన్సూరెన్స్, ప్రభుత్వ సేవలకు సంబంధించిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కారం చేస్తామని చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

- ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ

నంద్యాల: శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల పట్టణంలో బైక్‌పై తిరుగుతూ గస్తీని పర్యవేక్షించారు. సమయపాలన పాటించని, అనుమానం ఉన్న వ్యాపార సముదాయాలు, బార్లు, వైన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్, గాంధీ చౌక్,బంగారు అంగళ్ల వీధి, హరిజన పేట పెద్ద బండ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అర్ధరాత్రి వేళ పట్టణంలో తిరిగే ఆకతాయిలను ప్రశ్నించి, మళ్లీ కనిపిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గస్తీ సమయంలో తాళాలు వేసిన ఇళ్లు, రైల్వే స్టేషన్, బస్టాప్‌లు, ఆలయాలు, బ్యాంక్లు, ఏటీఎంలు, అన్ని ముఖ్యమైన కూడళ్లలోను తప్పక సందర్శించాలన్నారు. నిర్మానుష్యమైన ప్రదేశాలు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని ఆదేశించారు.

‘ఫ్యామిలీ డాక్టర్’కు సుస్తీ!



నాడు చిన్నారి స్వరూపకు ఇంటి వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ (ఫైల్)

- ఫ్యామిలీ డాక్టర్ సేవలను నీరుగార్చిన రాష్ట్ర ప్రభుత్వం
- కుప్పకూలిన ప్రజారోగ్య వ్యవస్థ
- గ్రామాల్లో నిలిచిపోయిన వైద్య శిబిరాలు
- కార్పొరేట్ వైద్యసేవలకు దూరమైన గ్రామాలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

ఎలా బతకాలి?

మంచానికే పరిమితమైన కుమార్తె స్వరూపకు నీళ్లుతాపుతున్న సారమ్మది దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామం. పుట్టుకతోనే మస్తిస్కా వ్యాధితో బాధపడుతున్న స్వరూపను వారానికికో పది రోజులకో ఒక సారి 40 కిలో మీటర్ల దూరం ఉన్న నంద్యాల ఆసుపత్రికి తీసుకు వెళ్లాలి. ప్రత్యేకంగా ఆటో బాడుగకు తీసుకోవాల్సి ఉండటంతో పేద కుటుంబమైన వీరికి ఆర్థిక భారంగా మారేది. అయితే గత వైస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్పెషలిస్ట్ డాక్టర్ ఇంటి దగ్గరకే వచ్చి ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇచ్చేవారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి ఇంటి దగ్గరకు కాదు కదా గ్రామానికి కూడా డాక్టర్ రాకపోవడంతో వీరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ‘ప్రతి నెలా రూ. 5వేల నుంచి రూ. 10 వేలు వరకు ఖర్చు వస్తోంది.. ఎలా బతకాలి’ అంటూ వృద్ధురాలు సారమ్మ కన్నీటి పర్యంతమయ్యారు.



ఆళ్లగడ్డ: సంపన్నులకే పరిమితమైన ‘ఫ్యామిలీ డాక్టర్’ సేవలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారుమూల పల్లెలకు వచ్చాయి. నిరుపేదలు సైతం ఇంటి వద్దే ఉచితంగా స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందుకున్నారు. నడవలేని వృద్ధులు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు సైతం ఇంటి దగ్గరకే ఉచితంగా మందులు పొందారు. అనేక రకాల వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించడంతో త్వరగా నయమయ్యేవి. రూపాయి ఖర్చు లేకుండా, దూర ప్రాంతాల్లోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దనే మెరుగైన వైద్య సేవలు అందేవి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ పథకాలపై కూటమి ప్రభుత్వం కక్షగట్టింది. దీంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలు మళ్లీ పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు పరుగు పెట్టాల్సిన దుస్థితి వచ్చింది.

భరోసా ఏదీ?

సహజంగా గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబంలో ఏ ఒక్కరికి జబ్బు చేసినా ఒకే వైద్యుడి వద్దకు ఆనవాయితీ. క్రమం తప్పకుండా ఒకే డాక్టర్ వద్దకు వెళ్తుండటంతో పేషెంట్‌పై ఆ డాక్టర్‌కు అవగాహన ఏర్పడుతుంది. రోగుల సమస్యలు తక్షణమే తెలుసుకుని త్వరితగతిన చికిత్స అందించే వీలుంటుంది. ఇలాంటి విధనంలానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ‘‘ ఫ్యామిలీ ఫిజీషియన్’’ విధానాన్ని అమల్లోకి తీసుకు రావడంతో బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచానికే పరిమితమైన రోగులకు ఎంతో లబ్ధి చేకూరింది. అయితే ఇప్పుడు ఈ కార్యక్రమాలు లేదు. దీంతో దీర్ఘకాలిక రోగులకు భరోసా దక్కడం లేదు. మంచానికే పరమితమైన వారు వైద్యం అందక దీనంగా చూస్తున్నారు.



మళ్లీ ప్రైవేటు వైద్యమే

అనారోగ్యంతో మంచంలో ఉన్న తల్లి రాళ్ల నన్నెబుకు సేవలు చేస్తున్న కుమారుడి పేరు యూసుఫ్. చాగలమర్రి బుగ్గరస్తాకు చెందిన నన్నెబూకు మూడేళ్ల క్రితం పక్షవాతం సోకింది. దీంతో అప్పటి నుంచి కేవలం మంచానికే పరిమితమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెలకు ఒకటి రెండుసార్లు ఇంటి దగ్గరకే స్పెషలిస్ట్ డాక్టర్ వచ్చి వైద్యం చేసేవారు. మధ్యలో అవసరమైతే ఫోన్ చేస్తే వైద్య సిబ్బంది వచ్చి సేవలు అందించేవారు. ప్రభుత్వం మారడంతో ఏడాదిగా వైద్యులు, సిబ్బంది ఎవరూ రావడం లేదు. దీంతో నెలనెలా ప్రొద్దుటూరు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందని యూసుఫ్ ఆవేదన వ్యక్తం చేశారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందిన సేవలు...

- ➤ ఆరోగ్య శిబిరాల్లో క్యాన్సర్, గుండె, కిడ్నీ, లివర్, మెదడు సంబంధిత ప్రాణాంతక వ్యాధులు సోకిన రోగులు లక్షలాది మందికి వైద్యసేవలు అందించారు. ప్రజలకు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసమైన 120 రకాల మందులు ఉచితంగా అందజేశారు.
- ➤ ఫిజీషియన్ ఇంటికే వచ్చి పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడంతో పాటు తగు సూచనలు, సలహాలు ఇస్తుండటంతో రోగులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేసేవారు.
- ➤ జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని 104 వాహనాలతో నిర్వహించారు.
- ➤ జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 2023 సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 16 వరకు 478 ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 2.95 లక్షల మందికి వైద్యసేవలు అందించారు. 2.70 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు 10,542 మందిని రెఫర్ చేశారు. 20,541 మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేశారు. సుమారు 30 వేల మందికి కళ్లద్దాలు అందజేశారు.
- ➤ 2024 జనవరి నుంచి మే వరకు రెండో విడతలో 368 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో సుమారు 2.60 లక్షల మందికి వైద్య సేవలు అందించారు. 1,79,456 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 2,341 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. 193 కేటారాక్ట్ శస్త్రచికిత్సలు చేసి, 9,547 మందికి కళ్లద్దాలు అందించారు.



పెద్దకంబలూరులో వృద్ధుడు సామేలుకు ఇంటి వద్ద సేవలు అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ (ఫైల్)



ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురంలో బాలింతను ఇంటిదగ్గరికి వెళ్లి పరీక్షిస్తున్న దృశ్యం (ఫైల్)

పనిచేయని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విలేజ్ హెల్త్ క్లినిక్స్ పట్ల చిన్నచూపు చూస్తోంది. అక్కడ పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓలకు జీతభత్యాలు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఎంఎల్‌హెచ్‌పీల సమ్మె కారణంగా గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూతపడ్డాయి. దీంతో రోగం వచ్చిన ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. సాధారణంగా పీహెచ్‌సీల్లోని ఇద్దరు వైద్యాధికారుల్లో ఒకరు ప్రతి నెలా రెండుసార్లు 104 వాహనంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌కు వెళ్లి రోగులను పరీక్షించాలి. నేడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు.

ఆరోగ్య సురక్షపై కక్ష

‘ఆరోగ్య సురక్ష’ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఫలితంగా పేదలకు స్పెషలిస్ట్ డాక్టర్‌ల సేవలు అందడం లేదు. ప్రతి రోజు ఆయా మండలంలోని ఒక సచివాలయంలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులతో పాటు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు, ఇతర వైద్య సిబ్బందితో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరాన్ని ఏర్పాటు చేసేవారు. వివిధ రకాల వ్యాధులతో శిబిరానికి వచ్చే వారికి వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేసేవారు. అంతేకాకుండా శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసి అక్కడ శస్త్రచికిత్సలు చేయించేవారు. అదే విధంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కంటి ఆపరేషన్లు చేయించడం, కళ్లద్దాలు కూడా అందజేసేవారు. ఆసుపత్రులకు వెళ్లాల్సిన పనిలేకుండానే లక్షలాది మందికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వార సేవలు అందాయి. కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు అందడం లేదు. ప్రజలు వ్యయప్రయాసలతో ప్రాణాలను చేతులో పెట్టుకుని దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

అఖిలా.. చౌకబారు విమర్శలు మానుకో!



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- హుందాగా రాజకీయాలు చేయడం నేర్చుకో
- అరాచకాలు ఆపకపోతే ప్రజలే తిరగబడతారు
- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ‘ఎమ్మెల్యేగా ఉంటూ చౌకబారు విమర్శలు చేయడం సరికాదు.. నోటికి వచ్చింది మాట్లాడటం ఎంత వరకు సమంజసం. హుందాగా రాజకీయాలు చేయడం నేర్చుకో’ అంటూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియకు మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హితువు పలికారు. అహోబిలం క్షేత్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో అహోబిలం టోల్‌గేట్ వేలంపాటల్లో తాను రూ. 25 లక్షలు డిమాండ్ చేశానని అఖిలప్రియ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో ఏదైనా రుజువులు ఉంటే చూపించాలన్నారు. రూ. 20 లక్షలు పాటపాడిన దానికి రూ. 25 లక్షలు తాను వాటా ఇవ్వాలని అడిగానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ‘ఇదే గేట్ వసూలుకు ఇప్పుడే రూ. 45 లక్షలు కట్టిస్తా.. అధికారులతో వేలంపాట రద్దు చేయించే సత్తా ఉందా’ అని సవాల్ విసిరారు. గతంలో రూ. 45 లక్షలు పాడిన సమయంలో రూ. 100 నుంచి రూ.150 వసూలు చేస్తే ఇప్పుడు రూ. 20 లక్షలకు పాట దక్కించుకున్న వారితో అంతకంటే తగ్గించి వసూలు చేయాలి కదా.. అని ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో బీ ట్యాక్స్‌కు తన వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయన్నారు. అధికార పార్టీ నేతలు కేజీకి అదనంగా ఇవ్వాలని బెదిరిస్తున్నారని చాగలమర్రి చికెన్ సెంటర్ నిర్వాహకులు ఎస్పీకి ఫిర్యాదు చేయలేదా అంటూ గుర్తు చేశారు. అఖిలప్రియ డబ్బులకు పదవులు అమ్ముకుంటుందోని ఆమె సొంత బాబాయ్ ఫిర్యాదు చేయలేదా.. ఇంతకంటే సాక్ష్యాలు కావాలా.. అని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నేతల అరాచకాలు ఆపకపోతే ప్రజలు తిరగబడే రోజు త్వరలోనే వస్తుందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు గంగుల విజయసింహారెడ్డి, కేకే రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాసారి ప్రసాద్, పత్తి నారాయణ, రామచంద్రుడు, మధు, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మా వెళ్లొస్తా..!

- చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు
- తల్లి కళ్ల ముందే విషాదం



హరిప్రియ (ఫైల్)

ఆళ్లగడ్డ: ‘అమ్మా.. బాయ్.. బాయ్..’ అంటూ ఉదయం స్కూల్ బస్సులో వెళ్లిన చిన్నారి సాయంత్రం అదే బస్సులో తిరిగి వచ్చింది. బస్సులో బిడ్డను చూసి ఆ తల్లి కళ్లలో ఆనందం మెరిసింది. అయితే ఆ ఆనందం క్షణాల్లోనే మాయమైంది. కళ్ల ముందే బిడ్డపై బస్సు చక్రాలు వెళ్లడంతో ఆ తల్లి తల్లడిల్లింది. ఉదయం బడికెళ్తూ తన బిడ్డ చెప్పిన మాటలను గుర్తు చేసుకుంటూ గుండెలు బాదుకుంది. రక్తపుమడుగులో తడిసి విగతజీవిగా మారిన కుమార్తెను చూసి కన్నీరు మున్నీరుగా విలపించింది. బడి బస్సు ఆ చిన్నారి పాలిట మృత్యుశకటమైంది. ఈ విషాద ఘటన ఆళ్లగడ్డలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఎంవీనగర్‌కు చెందిన శ్రీధర్, వనజ దంపతుల కూతురు హరిప్రియ (4) స్థానిక కీర్తన స్కూల్‌లో యూకేజీ చదువుతోంది. సోమవారం నుంచి స్కూల్‌కు వెళ్తుండగా రోజూ తండ్రి శ్రీధర్ వదిలి, తిరిగి తీసుకొచ్చేవారు. అయితే శుక్రవారం నుంచి స్కూల్ బస్సులో పంపడం మొదలు పెట్టారు. స్కూల్ ముగించుకుని మొదటిసారిగా బస్సులో వస్తున్న కూతురుని దించుకుని ఇంటికి తీసుకెళ్లేందుకు సాయిబాబా గుడిదగ్గర తల్లి వనజ వేచి ఉంది. బస్సులో నుంచి అమ్మను చూసిన ఆ చిన్నారి ‘అమ్మా నేను దిగుతున్నా.. అని చెయ్యి ఊపుతూ’ ఇవతలి వైపున దిగింది. ఆ తర్వాత అవలి వైపున ఉన్న తల్లి దగ్గరకు వెళ్లేందుకు అడుగు ముందుకు వేసింది. అంతలోనే డ్రైవర్ బస్సు కదిలించడంతో చిన్నారి బస్సు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. బిడ్డ మృతితో ఆ తల్లి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. పట్టణ సీఐ యుగంధర్, ఎస్‌ఐ నగీన ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వంపై అలీ అక్బర్ పీరు ఊరేగింపు

చాగలమర్రి: మొహర్రం వేడుకల్లో భాగంగా 8వ రోజు శుక్రవారం రాత్రి చిన్నమకానం వీధిలో కొలువైన అలీ అక్బర్ పీరును అశ్వంపై ఊరేగించారు. ఈ పీరును వివాహం కాని యువకులు ఊరేగించడం సంప్రదాయం కావడంతో యువత భారీగా తరలివచ్చింది. సంప్రదాయ మేళతాళాలతో చిన్నమకానంలో ప్రారంభమైన ఊరేగింపు లాల్ స్వామి మకానం మీదుగా పెద్దమకానం, మొయిన్ బజారు, పాతబస్టాండులోని నిర్వాహకుల ఇళ్ల వరకు కొనసాగి తిరిగి చిన్నమకానంలోని పీర్ల చావిడి వద్దకు చేరుకుంది. ఊరేగింపులో అడుగడుగునా భక్తులు పీరుకు మొక్కులు చెల్లించారు. దారివెంట స్వామి వారికి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు.





గుర్రంపై పీరును ఊరేగిస్తున్న దృశ్యం, భారీగా తరలి వచ్చిన భక్తులు

సీమపై చంద్రబాబుది కపట ప్రేమ

- శ్రీశైలం డ్యామ్ నిండుతున్నా నీళ్లు ఇవ్వరా?
- చలో పోతిరెడ్డిపాడు ఉద్రిక్తత
- 80 బన్నూరు వద్ద రైతులు, ప్రజా సంఘాల నాయకుల అడ్డగింత



ప్రజా సంఘాల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

జూపాడుబంగ్లా: రాయలసీమ రైతాంగంపై సీఎం చంద్రబాబునాయుడు కపట ప్రేమ చూపుతున్నారని ప్రజా సంఘాల నాయకులు, రైతులు విమర్శించారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలలో జాప్యం కావడంతో ‘చలో పోతిరెడ్డిపాడు’కు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాలోని నంద్యాల, గోస్పాడు, రుద్రవరం, ఆత్మకూరు, నందికొట్కూరు, పాములపాడు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా సంఘాల నాయకులు, రైతులు 80 బన్నూరు నుంచి పోతిరెడ్డిపాడు వరకు ర్యాలీగా బయలుదేరారు. అయితే అధికారుల ఆదేశాల మేరకు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం అధ్వర్యంలో ఎస్‌ఐలు ఓబులేసు, లక్ష్మీనారాయణతో పాటు పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. పోలీసుల తీరుకు నిరసనగా ప్రజా సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి రాజశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, రైతుసంఘం జిల్లా సెక్రటరీ సుధాకర్ తదితరులు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. శ్రీశైలం డ్యాంలో 875.90 అడుగుల నీటిమట్టం చేరినా పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలలో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేలు, ఎంపీలు.. డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు బలవంతంగా కొందరిని జీపులో ఎక్కించి తరలిస్తుండగా నాయకులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి సాగునీటిని విడుదలచేసే దాకా వెళ్లేదేలేదని భీష్మించి కూర్చొన్నారు. దీంతో సీఐ పోతిరెడ్డిపాడు ఈఈ నాగేంద్రకుమార్‌ను సంఘటనా ప్రాంతానికి రప్పించి సీఈ కబీర్‌బాషాతో మాట్లాడించారు. వారంలోగా నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చినా వారు శాంతించలేదు. ఈనెల 6తేదీలోగా నీటిని విడుదల చేయకపోతే తామే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, వీరన్న, సురేష్,రామకృష్ణ, రాముడు, కర్ణ, వాలయ్య, రంగమ్మ, ఈశ్వరమ్మ, సుధాకర్, సోమన్న, రామసుబ్బారెడ్డి, రణధీర్ రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోసంరక్షణనిధి పథకానికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ నిధి పథకానికి శుక్రవారం నెల్లూరుకు చెందిన ఉప్పలపాటి నందీశ్వర రాయల్ రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు టీ.హిమబిందుకు అందజేశారు. విరాళాన్ని అందించిన దాతకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

అరుణాచల క్షేత్రానికి 10న ప్రత్యేక బస్సు

కర్నూలు కల్చరల్: భక్తుల సౌకర్యార్థం ఏపీఎస్ రోడ్డు రవాణా సంస్థ కర్నూలు – 2 డిపో నుంచి తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల క్షేత్ర దర్శనం, గిరి ప్రదక్షణకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కేఎల్‌కే శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ ఉదయం 7 గంటలకు బయలు దేరి మార్గమధ్యలో కా ణికపాకం దర్శించుకొని అదే రోజు రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు బయలు దేరి వేలూరు గోల్డెన్ టెంపుల్ అమ్మవారిని దర్శించుకొని 12వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు కర్నూలు చేరుకుంటుందని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సులో రానుపోను రూ. 2000 ఛార్జీగా నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ నం. 73828 71131, డిపో మేనేజర్ 9959225794 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పోతుగల్లులో వ్యక్తి అదృశ్యం



బోయ రాముడు(ఫైల్)

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామానికి చెందిన బోయ రాముడు అదృశ్యమయ్యాడు. గత నెల 26న ఉదయం బహిర్భూమికి అని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ఫలితం లేకపోయింది. శుక్రవారం బాధితుడి భార్య బోయ రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఇతనికి 15 ఏళ్ల క్రితం పెళ్లి అయిందని కానీ పిల్లలు కాలేదన్నారు. ఇటీవల కాలంలో రాముడు అన్నకు బ్లడ్ క్యాన్సర్ రావడంతో సదురు విషయం గురించి బాధపడుతూ ఉండేవాడని బాధితుడి భార్య ఫిర్యాదులో పేర్కొంది.

ఇద్దరు దొంగల అరెస్ట్



దొంగల అరెస్టు చూపుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె రూరల్: స్థానిక కొండపేటలో గత నెలలో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు బనగానపల్లె అర్బన్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం తుడుములదిన్నె గ్రామానికి చెందిన కూకట్‌పల్లి భరత్‌కుమార్, అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని మారుతీ నగర్‌కు చెందిన వనార్చి మహేష్ పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఈ క్రమంలో కొండపేటలో గత నెల 1వ తేదీన కాటసాని బలరామిరెడ్డి ఇంట్లో రూ.7.50 లక్షల విలువైన ఆభరణాలు అపహరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు నిందితుల నుంచి ఏడు తులాల బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో తమ ప్రతిభను చూపించిన పోలీసులు సుబ్బరామకృష్ణ, నాగన్న, ప్రదీప్‌లను జిల్లా ఎస్పీ అభినందించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూలో పరీక్షలంటేనే హడల్!

- ఆర్గానిక్ కెమిస్ట్రీలో 2వ సెమిస్టర్‌లో 10 మంది విద్యార్థులు ఫెయిల్
- 3వ సెమిస్టర్‌లో అదే 10 మందితో పాటు మరో ఇద్దరు విద్యార్థులు ఫెయిల్
- వీరందరికీ మొదటి సెమిస్టర్‌లో 8 పాయింట్స్ పైనే మార్కులు



ఆర్‌యూ ఏడీ బిల్డింగ్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో పరీక్షలంటేనే హడలెత్తాల్సిన పరిస్థితి దాపురించింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ఒక సబ్జెక్టులో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత శాతం ఉంటే మరో సబ్జెక్టులో 50 శాతం కూడా దాటదు. మెరిట్ విద్యార్థులు సైతం ఫెయిల్ కావడం పరిపాటిగా మారడం లాంటి వింత పరిస్థితులు నిత్యకృత్యంగా మారాయి. నెల రోజుల్లో ఇవ్వాల్సిన పరీక్షల ఫలితాలు ఐదు నెలలైనా విడుదల చేయరు. తాజాగా ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థులు సమస్య వెలుగులోకి వచ్చింది. వర్సిటీలోని ఆర్గానిక్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో మొదటి సంవత్సరం 33 మంది, ద్వితీయ సంవత్సరం 43 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరంలో ఉన్న విద్యార్థులు 2వ సెమిస్టర్‌లో ఒక పేపర్‌కు సంబంధించి 10 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. 3వ సెమిస్టర్‌లో సైతం అదే 10 మందితో పాటు మరో ఇద్దరు విద్యార్థులు ఫెయిల్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఫెయిలైన విద్యార్థులందరికీ మొదటి సెమిస్టర్‌లో సరాసరి 8 పాయింట్స్ పైనే మార్కులు వచ్చాయి.

అడ్వాన్స్ సప్లిమెంటరీ నిర్వహణ నిర్ణయంపై అసంతృప్తి

2, 3 సెమిస్టర్లలో ఫెయిలైన 10 మందికి పైగా విద్యార్థులు ఇటీవల వర్సిటీ వైస్‌చాన్సలర్‌ను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. తాము పరీక్షల్లో ఫెయిలయ్యే సమస్యే లేదు కావాలంటే చాలెంజింగ్ వాల్యుయేషన్ చేయించండని వీసీతో వాదించారు. రీ వెరిఫికేషన్ రీ వాల్యుయేషన్‌కు అవకాశం ఇవ్వాలని వేడుకున్నారు. రీవెరిఫికేషన్ రీ వాల్యుయేషన్‌కు అవకాశం లేదని అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం ఇస్తామంటూ వీసీ చెప్పడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. తమ సమాధాన పత్రాలను మాకు చూయించండని ప్రశ్నించారు. వీసీని వేడుకున్నా, వాగ్వివాదం చేసినా అడ్వాన్స్ సప్లిమెంటరీ నిర్వహిస్తామని వీసీ చెప్పడంతో విద్యార్థులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

అధికారులు న్యాయం చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చి పీజీ చదువుతున్న మేం పరీక్షలు బాగా రాశాం. అయినా 10 మందిని 2, 3 సెమిస్టర్లలో ఫెయిల్ చేశారు. మొదటి సెమిస్టర్‌లో అందరం 8 పాయింట్ల పైగా మార్కులతో ఉత్తీర్ణులమయ్యాం. 2, 3 సెమిస్టర్లలో ఫెయిల్ కావడంతో వీసీని కలిసి సమస్య విన్నవించినా, ప్రశ్నించినా ఎలాంటి పరిష్కారం దొరకలేదు. అడ్వాన్స్ సప్లిమెంటరీ నిర్వహిస్తాం రాయండని వీసీ చెబుతున్నారు. మరో రెండు మూడు రోజుల్లో పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఓపెన్ చాలెంజ్ చేస్తున్నాం. మా సమాధాన పత్రాలను మా ముందర వాల్యుయేషన్ చేయించండి. మాకు న్యాయం చేయండి.

– 2,3 సెమిస్టర్లు ఫెయిలైన విద్యార్థులు

వైభవంగా సుదర్శనమూర్తి జయంత్యుత్సవం



ప్రత్యేకాలంకరణలో ఉభయ దేవేరులతో కొలువైన జ్వాలా నరసింహస్వామి



తిరుమంజనం సేవలో కొలువైన సుదర్శనమూర్తి

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో సుదర్శనమూర్తి జయంత్యుత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా కొలువైన మూలమూర్తులు శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామి, సుదర్శన మూర్తులను కొలు వుంచి నవకళశస్థాపన అనంతరం, పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించి ఉత్సవమూర్తులను నూతన పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలకంరించి కొలువుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉభయ దేవురులతో కొలువైన శ్రీ నృసింహస్వామి ఎదురుగా శ్రీ సుదర్శన మూర్తిని కొలువుంచి ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, వేద పండితుల వేదమంత్రోచ్చారణలు నడుమ సదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు.

సుదర్శన హోమం ప్రత్యేకత

సాధారణంగా నారసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున ఏడాది పొడవునా సుదర్శన హోమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఆషాఢ మాసంలో వచ్చే స్వాతి నక్షత్రానికి ముందు రోజు సుదర్శన మూర్తి జయంతి కావడంతో ఏడాదిలో ఈ ఒక్క రోజు సుదర్శన హోమం స్వాతి రోజు కంటే ముందు రోజు నిర్వహించడం జరుగుతుంది. సుదర్శన మూర్తి ఆరు చేతులతో ఆరు ఆయుధాలు కల్గి ఉండి వైష్ణవ దేవృళ్లను రక్షిస్తుంటారని విశ్వాసం. సుదర్శన మూర్తికి ఆదిదేవుడు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కావడంతో ప్రతి స్వాతి వేడుకల్లో సుదర్శన హోమం నిర్వహించడం ఆనవాయితీ. స్వాతి నక్షత్రం సందర్భంగా శనివారం దిగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులకు తెల్లవారుజామున జేష్టాభిషేక వేడుకలు నిర్వహించనున్నారు.

టీడీపీ నాయకుడి దౌర్జన్యం

అప్పు తిరిగివ్వమనడంతో రౌడీ మూకలతో దాడి

- గుండుపాపల గ్రామంలో ఉద్రిక్తత



ఇంటిపై దాడిచేస్తున్న సీసీ పుటేజీ

ఆళ్లగడ్డ: తీసుకున్న అప్పులు తిరిగివ్వమని అడగటంతో టీడీపీ నాయకుడు రౌడీమూకలతో కలిసి దాడిచేసిన ఘటన దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలివీ.. గుండుపాపల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాశీవిశ్వనాథర్‌రెడ్డి ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని రాజారెడ్డి దగ్గర అప్పుగా కొంత నగదు తీసుకున్నాడు. ఎన్నిరోజులైనా తిరిగి చెల్లించకపోవడంతో రాజారెడ్డి కుటుంబం అప్పు వసూలు చేసుకునేందుకు కొన్ని రోజులుగా గుండుపాపల గ్రామంలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాజారెడ్డి భార్యతో కలిసి కాశీవిశ్వనాథర్‌రెడ్డి ఇంటి దగ్గరకు వెళ్లి అప్పు విషయమై గట్టిగా నిలదీశారు. దీంతో ఆగ్రహించిన కాశీవిశ్వనాథర్‌రెడ్డి రాత్రి సుమారు 10 మంది రౌడీలతో కలిసి పూటుగా మద్యం సేవించి రాజారెడ్డి ఉన్న ఇంటిమీదకు వెళ్లి రాళ్లతో దాడిచేస్తుండగా బయటకు వచ్చిన రాజారెడ్డిపై దాడిచేసి కొట్టారు. ఇది గమనించిన రాజారెడ్డికి ఆశ్రయం ఇచ్చిన శేఖర్‌రెడ్డి బయటకు వచ్చి సర్ది చెప్పేందుకు యత్నిస్తుండగా దీనికంతటికీ కారణం నువ్వే. నువ్వు ఆశ్రయం ఇవ్వడంతోనే వారు ఇక్కడ ఉండి నన్ను రోజూ అప్పు అడుగుతున్నారని శేఖర్‌రెడ్డి కుటుంబంపైనా దాడి చేశారు. ఈ విషయంపై దొర్నిపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు గాయపడ్డ శేఖర్‌రెడ్డి, రాజారెడ్డిలు తెలిపారు.

పెయ్య దూడల అభివృద్ధికి చర్యలు

- జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి రాజశేఖర్

కర్నూలు(అగ్రికల్చర్): పెయ్య దూడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో 23,200, నంద్యాల జిల్లాలో 30 వేల పశువులకు పెయ్య దూడలు పుట్టడం లక్ష్యంగా కృత్రిమ గర్భధారణ సూదులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించామన్నారు. ఒక డోసు వీర్య నాళికల పూర్తి ధరను రూ.300 ఉండగా 50 శాతం సబ్సిడీ ఇచ్చే విధంగా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఆవులు, గేదెలు ఎదకు వచ్చినపుడు రూ.150 చెల్లించి లింగనిర్ధారిత వీర్య నాళికలతో కృత్రిమ గర్భాధారణ చేయించవచ్చని తెలిపారు.

రైతుల అభివృద్ధికి 'సహకార'ం



మాట్లాడుతున్న రామాంజనేయులు

గడివేముల: రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా సహకార అధికారి ఎస్ రామాంజనేయులు తెలిపారు. అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా శుక్ర వారం గడివేముల జెడ్పీ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ.. సహకార సంఘాలతో అనేక మంది రైతులకు రుణాలతో పాటు వివిధ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎస్‌డీఎల్ తిరుపాలయ్య, సూపరింటెండెంట్‌లు రాముడు, రషీద్ ఫకృద్దీన్, సంధాని, ఏజీఎం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో 17 మందికి జైలు

అనంతపురం: గంజాయి కేసులో 17 మందికి జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఇందులో 12 మందికి రెండేళ్ల జైలు, మరో ఐదుగురికి ఏడాది జైలు శిక్ష పడింది. మొత్తం 20 మందిపై అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2018లో గంజాయి కేసు నమోదైంది. నిందితులందరినీ ఆ ఏడాది సెప్టెంబర్ 11న అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మూడు కిలోల గంజాయి, రూ.40,12,000 నగదు, 32 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు క్యాలిక్యులేటర్లు, హాట్ స్పాట్ రూటర్, కారు స్వాధీనం చేసుకున్నారు. తర్వాతి కాలంలో నిందితుల్లో ముగ్గురు కర్నూలు జిల్లా డోన్ పట్టణానికి చెందిన షేక్ సిరాజుద్దీన్ (59), వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు పట్టణానికి చెందిన కార్మూరి ఇంద్రశేఖర్ (68), గుత్తికి చెందిన ఆర్.బి.విజయ్‌కుమార్ (48) మృతి చెందారు. మిగిలిన వారిపై నేరం రుజువైంది. వీరిలో 12 మంది తాడిపత్రికి చెందిన అచ్చుకట్ల అబ్దుల్లా, అచ్చుకట్ల మహమ్మద్ ఖాసీం, కోవెలకుంట్ల జాఫర్ వలి, గుత్తికి చెందిన ఎం.నారాయణ, వై.గోపాల్, ముల్లా జాఫర్, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన కోవెలకుంట్ల ఖలీల్, చౌడం సుబ్బరాయుడు, ఎర్రముక్కపల్లికి చెందిన గోనుగుంట్ల రామయ్య, పెద్దమండ్యం మండలం గుల్లకుంటకు చెందిన పి.రామచంద్రారెడ్డి, పి.జయచంద్రారెడ్డి, కర్నూలు జిల్లా డోన్ పట్టణానికి చెందిన దూదేకుల ఇబ్రహీంకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20వేల చొప్పున జరిమానా విధించారు. మరో ఐదుగురు తాడిపత్రికి చెందిన అచ్చుకట్ల సాదిక్ అలియాస్ కట్లపుడి సాదిక్, గుత్తి హబీబా ఖాన్, అచ్చుకట్ల అబు బకర్ అలియాస్ బకర్, చౌడం ప్రసాద్ కుమార్ అలియాస్ ప్రసాద్, కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన దూదేకుల లాల్ బాషాకు ఏడాది జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

వృద్ధ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: డెబ్బై ఏళ్ల వయస్సు పైబడి, అనారోగ్యంతో బాధ పడుతున్న ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తూ త్వరగా బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. శుక్రవారం ఆయన కర్నూలు శివారులోని పురుషుల కేంద్ర కారాగారం, నగరంలోని మహిళా కారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు ఖైదీలకు ప్రిజన్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సలహాలు అందిస్తారన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని, రేషన్, వారి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి అవగాహన కల్పించారు.

కేజీ వెండి బహూకరణ



వెండిని అందజేస్తున్న దబ్బల అశోక్

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ ఆలూరు తాలూకా యూత్ అధ్యక్షుడు దబ్బల అశోక్ మొక్కు బడిగా ఆస్పరిలోని పెద్ద పీర్లుకు రూ.1.10లక్షల విలువ చేసే కేజీ వెండిని శుక్రవారం నిర్వాహకుడు ఆలీబాషాకు అందజేశారు. అశోక్ కుటుంబ సభ్యులు పూజలు చేసి పీర్లను దర్శించుకున్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ వెంకట బసరావు

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ పీజీ 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ వెంకట బసరావు విడుదల చేశారు. ఏప్రిల్ 15 నుంచి 19వ తేదీ వరకు జరిగిన పరీక్షలకు 51 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 51 మంది ఉత్తీర్ణత సాధించారని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స డాక్టర్ కే నాగరాజు శెట్టి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీఈడీ..

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జనవరిలో జరిగిన బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షల పునఃమూల్యాంకన ఫలితాలు విడుదలయ్యాయి. 127 మంది దరఖాస్తు చేసుకోగా 19 మంది ఉత్తీర్ణులైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

డిగ్రీ..

డిసెంబర్‌లో జరిగిన డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షల పునః మూల్యాంకన ఫలితాలు విడుదల అయ్యాయి. మొదటి సెమిస్టర్‌కు 1673 మందికి 466, 3వ సెమిస్టర్‌కు 2335 మందికి 698, 5వ సెమిస్టర్‌కు 1592 మందికి 435 మంది ఉత్తీర్ణత సాధించారు.

12 గంటలు.. 23 ఎకరాలు



కాడెద్దులతో మొక్కజొన్న విత్తనం వేస్తున్న రైతు శ్రీను

నందికొట్కూరు: పొలంలో అడుగు పెడితే మాకెదురు లేదు.. అంటూ నందికొట్కూరుకు చెందిన ఓ రైతు వృషభాలు రంకేసి చెబుతున్నాయి. 12 గంటల్లో 23 ఎకరాల్లో ఎద్దులతో విత్తనం వేసి ఓ రైతు రికార్డు సృష్టించాడు. పట్టణానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఓ రైతుకు చెందిన 25 ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు భూమి పదునెక్కడంతో మొక్కజొన్న విత్తనం వేసేందుకు పట్టణానికి చెందిన రైతు శ్రీను కాడెద్దులతో శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 23 ఎకరాల భూమిని కాడెద్దులతో విత్తనం వేశాడు. విషయం తెలుసుకున్న రైతులు, గ్రామస్తులు ఎద్దులను చూసేందుకు ఆసక్తి చూపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ



వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: ఒకే కాలనీలో ఐదు డెంగీ కేసులు నమోదు అయ్యే వరకు ఏమి చేస్తున్నారు.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో డెంగీ కేసులు నమోదు కావడంతో శుక్రవారం ఆయన పట్టణంలో పర్యటించారు. ప్రజా ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. తరచూ కాలనీలో పర్యటిస్తూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పలు కాలనీలో పారిశుద్ధ్యం లోపించడంతో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్‌తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మలేరియా ఇన్‌చార్జ్ సత్యనారాయణ, డాక్టర్ బాలాజీ మహర్షి, వైద్య సిబ్బంది మధుసూదన్, అనంద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మొహర్రం వేడుకల్లో గొడవలు వద్దు

- ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి: డీఎస్పీ

ఎమ్మిగనూరురూరల్: మొహర్రం వేడుకల్లో గొడవలు పెట్టుకోవాలని చూస్తే పోలీస్ చర్యలు చాలా కఠినంగా ఉంటాయని డీఎస్పీ ఉపేంద్రబాబు హెచ్చరించారు. కోటేకల్ గ్రామానికి ఉన్న ఫ్యాక్షన్ ముద్రను చెరిపేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. శుక్రవారం రాత్రి కోటేకల్ గ్రామస్తులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో గతేడాది మొహర్రం వేడుకలు సందర్భంగా తప్పిదం జరిగిందని, ఈ సారి అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. పీర్ల ఊరేగింపు, సాహుసోని ఆడేటప్పుడు అందరూ అన్నదమ్ముల్లా ఉండాలన్నారు. రూరల్ సీఐ మధుసూదన్‌రావు, ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

బాబూ.. పింఛన్ ఇవ్వండి!



సహాయకుడి సాయంతో నడుస్తున్న ఈ అవ్వ పేరు వడ్డె పెద్ద పాపమ్మ. నందవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన ఈమెకు 77 ఏళ్ల ఉన్నాయి. భర్త వడ్డె పెద్ద రాముడు మృతి చెంది రెండు సంవత్సరాలైనా ఇప్పటి వరకు అవ్వకు పింఛన్ రాలేదు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి శుక్రవారం వస్తున్నారని తెలుసుకుని ఒంటరిగా ఆటోలో తన స్వగ్రామం నుంచి బయలు దేరి ఉదయం 10 గంటలకు నందవరానికి వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎదురు చూసినా ఎమ్మెల్యే రాలేదు. దీంతో వృద్ధురాలు కన్నీరు పెట్టారు. పింఛన్ రావడం లేదు, బియ్యం కూడా వేయడం లేదని ఆమె విలపించారు. ఎమ్మెల్యే ఆలస్యంగా రావడంతో అప్పటికే వృద్ధురాలు పెద్దపాపమ్మ స్వగ్రామానికి వెళ్లారు.

– నందవరం

'కార్పొరేట్' కోసమే పీపీపీ విధానం

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారుకొండ సాయికుమార్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

కర్నూలు(టౌన్): కార్పొరేట్ రంగాన్ని పెంచి పోషించేందుకే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పీపీపీ (పబ్లిక్, ప్రైవేటు, పార్టనర్‌షిప్) విధానాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి కటారు కొండ సాయి కుమార్ విమర్శించారు. ఈ విధానంతో రాష్ట్రంలో మెరిట్ ఉన్న పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి నేతలు ఈనెల 7వ తేదీన విజయవాడలోని ఎన్‌టీఆర్ యూనివర్సిటీలో ఉపకులపతిని కలిసి మెమోరాండం అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. కర్నూలు ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె గౌతమ్ మాట్లాడుతూ.. అన్ని అర్హతలు ఉన్న యువ వైద్యులు వారి హక్కు అయినా పీఆర్ (పర్మనెంట్ రిజిస్ట్రేషన్)ను అడిగితే పోలీసుల చేత అగౌరవపరిచారన్నారు. విద్యార్థి విభాగం కర్నూలు నగర అధ్యక్షులు అన్సర్ మాట్లాడుతూ విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలను సహించబోమన్నారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు శ్రీకాంత్, కోడుమూరు నియోజకవర్గ నాయకులు శ్రీధర్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



అనుమానాస్పదంగా మృతిచెందిన వ్యక్తి

కర్నూలు: కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలోని కేవీఆర్ కాలేజీ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందారు. రోడ్డుపై అనాథ శవం పడి ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరు కుని మృతదేహాన్ని పరిశీలించి పరిసర ప్రాంతాల్లో ఆరా తీశారు. ఈనెల 1వ తేదీ సాయంత్రం నుంచి మృతదేహం అక్కడే పడివున్నట్లు స్థానికులు తెలిపారు. సుమారు 65 సంవత్సరాల వయస్సు ఉండి తెలుపు, అడ్డు గీతలు కలిగిన టీషర్టు, నలుపు రంగు షార్ట్ ధరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరిచారు. ఆచూకీ తెలిసినవారు 91211 01060, 08518-220189కు ఫోన్ చేసి సమాచారం అందించాలని రెండో పట్టణ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

రోడ్లన్నీ జలమయం



ఉత్తుత్తి వాగులో నిలిచిన ఆర్టీసీ బస్సు

కోసిగి: మండలంలో శుక్రవారం సాయంత్రం ఒక గంట పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కోసిగిలోని పంచాయతీ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు భాగంలోని ప్రధాన రోడ్డులో, ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపు నీరు నిల్వ ఉండి రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అలాగే రైల్వే గేటు సమీపంలోని ఉరుకుంద ఆర్చ్ వద్ద ఉత్తుత్తి వాగు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోసిగి ప్రధాన రోడ్డులో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనదారులు కోరారు.